

# అమెరి'కా'లేజ్ కథలు

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన కథలుగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**కిటికీలోంచి** చూస్తూ అయిన వారందరిని వదలడం వల్ల కలిగే దిగులు నుండి బయటకి రావడం అసంభవం అనుకుంటుండగానే విమానం గాల్లోకి ఎగరడంతో వళ్ళంతా కుదిపేసింది. గట్టిగా కళ్ళు మూసుకుని ప్రార్ధన మొదలుపెట్టాను. పెద్ద శబ్దం భరించలేక చెవులు మూసుకున్నాను. నేను కోరుకున్నట్టుగానే విమానం మా ఊరు దాటి వెళ్ళదేమో, కేర్ ఫుల్ వాట్ యు విష్ ఫర్ అని ఊరికే అనరు. కడుపంతా ఒక్కసారిగా తిప్పింది. నెమ్మదిగా విమానం ఊగడం ఆగింది. మోత కూడా తగ్గింది. అప్పుడే చచ్చి స్వర్గం చేరానా? యమభటులు కనిపిస్తారేమో అని భయపడుతూ కళ్ళు తెరిచాను. అప్పుడే సన్‌రైజ్ అవుతున్న బంగారు ఆకాశం, అక్కడక్కడ పరచుకున్న తెల్లని మబ్బులు. ఆకాశాన్నింత దగ్గరగా చూడ్డం ఇదే మొదటిసారి. ఎంత అందం! ప్రకృతి ప్రకృతే.

ఆ అందాన్ని ఆస్వాదిస్తూ పక్కకి తలతిప్పి దడుసుకున్నాను. నా పక్కన కూర్చున్న మా అమ్మ వయసు ఆవిడ నన్ను చూసి నవ్వాపుకునే ప్రయత్నంకూడా చెయ్యలేదు. మరీ అంత అనాగరికంగా ప్రవర్తించానా? ఈ ఫ్లైట్ అంతా ఇంక ఈవిడ పక్కనే అని బాధపడుతుండగా "దాన్నే టర్బ్యులెన్స్ అంటారమ్మ. ఫ్లైట్ టేక్ ఆఫ్‌కి సౌండ్ అలానే వస్తుంది" అని జాలిగా వివరించారు.

టర్బ్యులెన్స్ గురించి అన్నయ్య హెచ్చరించాడు. నేను కూడా కాలేజీలో చదువుకున్నాను. కానీ అంతలా ఎందుకు భయపడ్డానో అంతు చిక్కడంలేదు. పొద్దున పూట ఫ్లైట్‌తో ఉన్న ఒక్క అడ్వాంటేజ్ కొద్దిసేపు హాయిగా నిద్రపోవచ్చు. కళ్ళుమూసుకున్న రెండు నిమిషాలకి ఎయిర్ హోస్టెస్ గొంతుకి లేచాను. ఒక వేడి టవల్‌నిపట్టకారతో ఇచ్చినప్పుడు "ఇది రిఫ్రెష్ అవ్వడానికమ్మా" అని పక్క సీట్ ఆవిడ చెప్పారు. కొన్ని క్షణాలు గడిచాక మరో ఎయిర్ హోస్టెస్ జ్యూస్‌ని తెచ్చినప్పుడు ఆ గ్లాస్‌ని అందిస్తూ పక్క సీట్ ఆవిడ "ఇది జ్యూస్ అమ్మ" అన్నారు.

నాకు మరీ ఆ మాత్రం కూడా తెలీదనుకుంటుందా ఈవిడ? ఇది మరీ టూ మచ్. ఈవిడకి నాగురించి తెలీదుకానీ... అనుకుంటుండగా ఫ్లైట్ కాస్త లెఫ్ట్ తిరిగినట్టు అనిపించింది. నా ఏరో నాటిక్స్ బ్రైన్‌ని వాడి "కంట్రోల్ స్టిక్‌ని లెఫ్ట్‌కి తిప్పినప్పుడు లెఫ్ట్ ఏలెరాన్ పైకి, రైట్ ఏలెరాన్ కిందకి వెళ్ళడం వల్ల ఫ్లైట్ లెఫ్ట్ తిరుగుతుంది" అని కాస్త జ్ఞానదానం చేసి హెడ్ ఫోన్స్ పెట్టుకుని కళ్ళు మూసుకున్నాను.

నిద్రపట్టడంలేదు. బెంగ మళ్ళీ కమ్ముతున్నట్టు ఉంది. వాచ్‌లో టైం తొమ్మిది అయ్యింది. అమ్మ అన్నయ్యతో నా ఏడుపు భాగవతంని చెప్పి తను కూడా ఏడుస్తూ ఉంటుంది. నాన్న న్యూస్ పేపర్‌ని చదువుతూ ఆఫీసుకి వెళ్ళాలా? అమ్మతో ఉండాలా అని ఆలోచిస్తుంటారు. ఎయిర్‌పోర్ట్‌లో ఫ్రెండ్స్ ఇచ్చిన గ్రీటింగ్ కార్డ్‌ని తెరిచేలోపు నా బుగ్గ మీద కారిన కన్నీరుని గమనించి నా పక్కన కూర్చున్నావిడ "అమెరికాకి చదువుకోడానికి వెళుతున్నావా?" అని అడిగారు.

కళ్ళు తుడుచుకుని "ఔను" అని చెప్పాను.

"ఫస్ట్ టైం అనుకుంటా?" అని ఆవిడ అడిగినప్పుడు గుక్కపట్టి సమాధానం చెప్పలేకపోయాను. ఆవిడ ఒక ఫోటో చూపించి "ఇది నేను ఫస్ట్ టైం ఒక్కదాన్ని ప్రయాణించినప్పుడు తీసిన ఫోటో. నువ్వు నా కన్నా చాలా నయం. నాకైతే చేతులు తెగ వణికాయి. అప్పట్లో ఫ్రీగా చాక్లెట్లు ఇచ్చేవారు. అవి తీసుకోడానికి కూడా ఎంతో భయపడ్డాను" అని ఆవిడ నవ్వారు.

"మీరు కూడా చదువుకోడానికి వెళ్ళారా?" అని అడిగాను.

"లేదమ్మా. మా ఆయన డాక్టర్. అమెరికాలో న్యూరాలజీలో స్పెషలైజేషన్ చేసారు. మూడేళ్ళు వంటరిగా ఉన్నాక నాకు పేపర్లు పంపి, వీసాకి ధైర్యం చెప్పి, నానా తంటాలు పడ్డారు. అప్పటికి నువ్వు పుట్టి ఉండవు" అని బదులిచ్చారు.

ఆయన న్యూరాలజిస్ట్ అంటే ఈవిడ ఇంకేం చేస్తారో అని క్యూరియాసిటీతో "మీరు కూడా డాక్టరా?" అని అడిగాను.

"లేదు. ఎం.ఏ ఇంగ్లీష్ లిటరేచర్ చదివాను కానీ ఎప్పుడూ ఉద్యోగం చెయ్యలేదు. ఇందాక చెప్పాను కదా, అమెరికాకి వెళ్ళడానికే అంత కుస్తీ పట్టాను. ఇంక ఉద్యోగం అంటే అంతే సంగతులు" అని నవ్వారు.

ఇంతలో బ్రేక్ ఫాస్ట్ సర్వ్ చేసారు. నా ట్రే చూసి "నువ్వు వెజిటేరియనా?" అని ఆవిడ అడిగారు.

అవునని చెప్పాను. "ఇప్పుడు రెస్టారెంట్స్‌లో కూడా వెజిటేరియన్ బానే దొరుకుతున్నాయి. నేను వచ్చిన కొత్తల్లో చాలా ఇబ్బంది పడ్డాను" అంటూ మా కబుర్లతో కాలం గడిచిపోయింది.

పైలెట్ లాండింగ్‌కి ప్రిపేర్ అవ్వమని అనౌన్స్ చేసారు. లాండింగ్ ఎలా ఉంటుందో అని భయపడి టెన్షన్ పడుతుండగా "ఇందాక ఫ్లైట్ లెఫ్ట్ ఎలా తిరుగుతుందో చెప్పావు. లాండింగ్ ఎలా జరుగుతుందో కూడా నీకు తెలుసుండాలే?" అని ఆవిడ చిన్నగా నవ్వారు.

"లాండింగ్ అప్పుడు.." అంటూ కాలేజ్‌లో చదువుకున్న పాఠం అంతా ఆవిడకి అప్పచెప్పాను.

ఫ్లైట్ దిగేముందు "ఇది మా ఆయన కార్డ్. దీని వెనక నా ఫోన్ నంబర్, ఈ మెయిల్ అడ్రెస్ ఉన్నాయి. ఎప్పుడైనా డాలస్ వస్తే తప్పకుండా ఫోన్ చెయ్యి" అని చెప్పారు. ఆవిడ ఇచ్చిన కార్డుని ఎంతో భద్రంగా నా వాలెట్‌లో పెట్టి ఈవిడే లేకపోతే ఈ ఫ్లైట్ అంతా నా ఏడుపుతోనే గడిచిపోయేది అనుకుంటూ ఏరో బ్రిడ్జ్ మీదగా నడుస్తూ గేట్‌ని చేరినప్పుడు తిరిగి రియాలిటీకి వచ్చాను.

ఇప్పుడు తరువాతి ఫ్లైట్ ఎక్కడ ఎక్కాలో ఏంటో? ఇందాకటావిడని హెల్ప్ అడుగుదామని అటూ ఇటూ చూసాను. కానీ ఆవిడ వెళ్ళిపోయారు. ఇందాకే అడిగుండాలిసింది. 'ఛా'. వాచ్‌లో టైం చూస్తే తరువాతి ఫ్లైట్‌కి ఇంకా ముప్పావు గంటే ఉంది.

టెన్షన్‌కి కాళ్ళూ చేతులు వణకడం మొదలైంది. ఇంతలో ఎదురుగా ఇన్‌ఫర్మేషన్ డెస్క్ కనబడడంతో గబగబా పరుగెత్తి అక్కడ కూర్చున్న ఆవిడకి నా బోర్డింగ్ పాస్ చూపించి ఫ్లైట్ ఎక్కడ ఎక్కాలని అడిగాను. ఆవిడ ఒక్క చూపు చూసి లైన్‌లో వెనకాల నిలబడమంది. లైన్ చూస్తే కదిలేట్టు లేదు. పక్కనే ఉన్న మానిటర్ స్క్రీన్‌లో చూద్దాం అని వెళ్ళాను. చాట భారతంలాంటి లిస్ట్‌లో నా ఫ్లైట్ నంబర్‌ని వెతుకుతుండగా పక్కన ఒక అబ్బాయి ఫోన్‌లో చూసి నా ఫ్లైట్ నంబర్ చెప్పి "టర్మినల్ డి ఔర్ గేట్ 7 భాయ్" అన్నాడు.

వెంటనే అతని వెనక పరుగెత్తాను.

తను వెనక్కి తిరిగి "వాట్?" అని కోపంగా అడిగాడు. నేనూ అదే ఫ్లైట్ అని గేట్ ఎక్కడో తెలీదని చెప్పాను. ఇంకా వేగంగా నడవడం మొదలుపెట్టాడు. తన వెనకే ఓ ట్రైన్‌లో ఎక్కాను. మొహం చిట్లించుకుని "ఫైన్" అని తనతోపాటు నడవచ్చు అన్న విధంగా తలూపాడు.

"వీ హేవ్ ఓన్లీ హాఫెనవర్" అని చెప్పాను.

నా వాచ్‌ని చూసి తల అడ్డంగా ఊపి "త్రీ అవర్స్. టైం డిఫరెన్స్" అనగానే నా గుండె కాస్త తేలికైంది. అమ్మ మాటవిని అన్నయ్య చెప్పినవి ఓ పేపర్లో రాసుకోవాల్సింది.

గేటు దగ్గర కూర్చుని కాస్త ఊపిరి పీల్చాక బేగ్‌లో పాస్‌పోర్ట్, ఐ - 20, బోర్డింగ్ పాస్, మొదలగు డాక్యుమెంట్స్ ఉన్నాయో లేదో చెక్ చేసుకున్నాను. ఎందుకైనా మంచిదని అక్కడ పనిచేస్తున్న ఆవిడకి నా బోర్డింగ్ పాస్ చూపించి ఈ గేటేనా అని అడిగాను. ఇన్‌ఫర్మేషన్ డెస్క్‌లో ఆవిడలా కాక చిరునవ్వుతో "ఎస్ మేమ్ బోర్డింగ్ బిగిన్స్ ఇన్ టు అవర్స్" అని చెప్పింది.

"బోర్డింగ్ స్టార్ట్ అయ్యాక ముందు బిజినెస్ క్లాస్ వాళ్ళు ఎక్కుతారు. ఎకానమీ క్లాస్‌ని పిలిచినప్పుడే నువ్వు వెళ్ళాలి. కంగారులో గబగబా దూసుకెళ్ళిపోకు. లైన్‌లో నిలబడు" అంటూ అన్నయ్య చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అంటే కనీసం రెండు గంటలన్నమాట. ఆవిడని అడిగి వాచ్‌లో టైం సెట్ చేసి ఎయిర్‌పోర్ట్ చూద్దాం అని బయలుదేరాను. ఇక్కడి గాజు గోడలు, ఫౌంటెన్, డ్యూటీ ఫ్రీ షాప్స్, మొదలుగునవి చూసి ఎంతో ఆశ్చర్యపోయాను. ఫ్లైట్‌లో ఆవిడ నన్ను బారిష్టర్ పార్వతీశం అనుకోవడంలో అస్సలు తప్పేలేదు. మెక్‌డొనాల్డ్స్ ని చూసాక కడుపులో ఆకలి తెలిసింది. వెజ్జీ మీల్ ఆర్డర్ చేస్తే వెజ్‌లో కేవలం ఫ్రెంచ్ ఫ్రైస్, ఆపిల్ పై మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఇదే నా మొదటి కల్చర్ షాక్. బర్గర్ కింగ్‌లో కూడా అదే పరిస్థితి. వెనక్కి తిరిగుదాం అనుకున్న సమయానికి ఎదురుగా జషన్ అనే ఇండియన్ రెస్టారెంట్‌ని చూసాక ఆకలి ఇంకాస్త పెరిగింది. అక్కడ ఆలూ టిక్కీ చాట్‌ని తింటుండగా పక్క టేబుల్‌లో ఆయన నన్ను చూసి చిన్నగా నవ్వారు. మరీ అంత టేబుల్ మేనర్స్ లేకుండా అయితే లేను. మొహానికి ఏమైనా అంటిందేమో అని నేప్‌కిన్‌తో తుడుచుకున్నాను. ఎదురుగా నడుస్తున్న ఒకరు కూడా అలానే నవ్వేసరికి చిన్నబోయి గబగబా తిని గేటు దగ్గరకి వెళ్ళి బాగ్‌ని గట్టిగా పట్టుకుని కూర్చున్నాను. చుట్టుపక్కల చూసాక తెలిసింది. నన్ను చూసి ఎవరూ నవ్వలేదు, కేవలం స్మైల్ చేసారని ఇక్కడ పరిచయం లేకపోయినా అందరూ స్మైల్ చేస్తారన్నమాట.

"బాగ్ జాగ్రత్త, పాస్ పోర్ట్ జాగ్రత్త" లాంటి తెలిసిన విషయాలు కాకుండా ఇలాంటి తెలీని విషయాలని ఎవరైనా చెప్పాల్సింది. ఇంకా ఇలా ఎన్ని నేర్చుకోవాలో అనుకుంటూ ఫ్లైట్ ఎక్కి నా సీట్‌లో కూర్చున్నాను. హమ్మయ్య ఇంక దిగాక అన్నీ అన్నయ్యే చూసుకుంటాడు. నేను దేని గురించి భయపడక్కర్లేదు. ఓ పెద్ద గోల వదిలింది అని కళ్ళు మూసుకున్న ఓ నిమిషానికి ఎవరో తట్టినట్టు అనిపించింది. చూస్తే ఓ చిన్నబాబు. ఆరునెలలుంటాయి కాబోలు. వాళ్ళ అమ్మపైన సూట్ కేస్‌ని పెడుతుంది. టేక్ ఆఫ్‌తో ఆ బాబు

ఏడుపు మొదలైంది. వాళ్ళ అమ్మ ఫోన్‌లో మునిగిపోయింది. నా ముందున్న స్క్రీన్‌లో సినిమా చూస్తుంటే ఆ బాబు కూడా కొద్దిసేపు చూసి నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు. నేను తెలీకుండానే ఓ కునుకు తీసాను.

అన్నయ్య బావుంటుందన్నాడని ఎయిర్ హోస్టెస్‌ని జింజర్ ఏల్ అడిగాను. ఇల్లు, అమ్మ గుర్తొచ్చి దిగులులోకి మునిగేలోపు పక్కన కూర్చున్న బాబు వాళ్ళ అమ్మ కోక్ గ్లాస్‌ని నెట్టడంతో నా జీన్స్ మీద పడింది. ప్రశాంతంగా ఏడవను కూడా ఏడవలేకపోవడం అంటే ఇదే కాబోలు. వాళ్ళ అమ్మ సారీ చెప్తూ ఇచ్చిన నేప్‌కిన్ సెకండులో తడిసిపోయింది. మార్చుకోడానికి బట్టలన్నీ చెకిన్ చేసిన సూట్ కేసులో ఉన్నాయి. ఇల్లు చేరేసరికి వంటికి అతుక్కుపోయి అట్టకట్టకపోతే చాలు.

చిరాకు, ప్రొద్దున్నుండి ఏడుపు, నిద్రలేకపోవడం కలిసి కాస్త తలనొప్పి మొదలైంది. ఫ్లైట్‌లో ఇచ్చిన లంచ్ తిన్నాక కాస్త సర్దుకున్నాను. ఎయిర్ హోస్టెస్ పూర్తైన ట్రేని తీసుకువెళ్ళడానికి వచ్చినప్పుడు నా చేతిని ఆ బాబు నెట్టడంతో అందులో సగం తిన్న ఏపిల్ ముందు కూర్చున్న ఆయన బట్టతల మీదుగా ఆయన ఒళ్ళో పడింది. "సారీ. సారీ ఐ యాం వెరీ సారీ" అని వెంటనే భయపడుతూ చెప్పాను. ఆయన నేప్‌కిన్‌తో తల తుడుచుకుంటూ. "ఇట్స్ ఒకే" అన్నారు. ఎయిర్ హోస్టెస్ నవ్వుకుంటూ వెళ్ళింది.

ఇంకా ఎంతసేపో అని విసుగ్గా కూర్చున్నాను. ప్రతి నిమిషం ఓ గంటలా గడిచింది. ఎయిర్ హోస్టెస్ సహాయంతో తంటాలు పడుతూ ఇమిగ్రేషన్ ఫార్మ్‌ని నింపాను. "ప్రిపేర్ ఫర్ లాండింగ్" అని పైలట్ అనగానే నా ప్రాణం లేచొచ్చింది. విమానం దిగి గాలిపీల్చి విడుదల అనుకున్నాను.

ఇమిగ్రేషన్ ఆఫీసర్ అడిగిన ప్రశ్న నాకు మొదటి రెండు సార్లు అర్థంకాలేదు. మూడోసారి ప్రశ్న అర్థమైనా సమాధానం తెలీక చెప్పలేదు.

"పర్ద్యూ యూనివర్సిటీ, నా? హూ ఈజ్ ది మేస్కాట్?" ఆయన అడిగిన ప్రశ్న.

"బాయిలర్ మేకర్ స్పెషల్" ఆయనిచ్చిన సమాధానం. ఇదికూడా తెలీదా అన్న విధంగా కొన్ని సెకండ్లు నవ్వి, "వై ఆర్ యు ఇన్ కొలొరాడో?" అని అడిగారు.

"టు స్పెండ్ టైం విత్ మై బ్రదర్" అని చెప్పాను.

ఫింగర్ ప్రింట్స్, మొదలగు ఫార్మాలిటీలన్నీ పూర్తయాక "స్టడీ వెల్" అని పాస్‌పోర్ట్ ఇచ్చారు.

సూట్ కేసులని కష్టపడి ఎత్తి ట్రాలీ మీద పెట్టి వంద కేజీలు ఎత్తానంటే నేను చాలా బలశాలిని అనుకుంటూ కస్టమ్స్ చెక్‌కి వెళ్ళాను. ఒక పెద్దాయన "డిడ్ యు బ్రింగ్ ఎనీ ఎడిబుల్స్?" అని అడిగారు.

అన్నయ్య చెప్పినట్టే "నో" అన్నాను. నా గొంతులో బెదురు తెలిసిందనుకుంటా ఓ సూట్ కేస్‌ని తడుముతూ "వాట్ ఈజ్ దిస్?" అని అడిగారు. ఏదో రౌండ్ గా తగిలింది. "ఐ డోంట్ నో" అనడంతో ఆయన పెట్టి తెరిచి చూస్తే అది మా అమ్మ సర్దిన స్టీల్ కంచం అది చూసి ఆయన కాస్త నవ్వాపుకున్నారు. దాని పక్కనే ఉన్న అట్టపెట్టెను తీసి "వాటీజ్ దిస్?" అని దానిమీద ఉన్న చిన్న అక్షరాలను చదివే ప్రయత్నం చేస్తూ అడిగారు.

కాస్త భయపడుతూ "ఏ టు జెడ్" అన్నాను. ఆయన ఒక కనుబొమ్మ ఎగరేసి "ఏ టు జీ. వాట్ ఈజ్ ఇట్?" అని మళ్ళీ అడిగారు.

"విటమిన్ టాబ్లెట్స్" అని బదులిచ్చాను. పెట్టె మూస్తూ "ఇట్స్ నాట్ విటమిన్. ఇట్స్ వైటమిన్" అని సరిచేసి కాస్త నవ్వారు. ఇప్పటిదాకా ఈ దేశంలో అందరికీ నేను జోకులా కనిపించాను అని కాస్త చింతిస్తూ బయట అన్నయ్యకోసం వెతకడం మొదలు పెట్టాను. ఎంతకీ కనబడడు. అసలు గుర్తుందో లేదో అని గాబరా పడుతుండగా "ఇంకా ఎంతసేపు వెతుకుతావే?" అని అన్నయ్య గొంతు పలకరించింది.

వెంటనే వాటేసుకుని భోరున ఏడ్చాను.

"అంతా బానే జరిగిందా? ఏమైనా ప్రోబ్లమ్ అయిందా?" అని అడిగాడు.

"ఏం కాలేదు. అంతా బానే జరిగింది" అని కళ్ళు తుడుచుకుంటూ అన్నయ్య చెయ్యిపట్టుకుని కొత్త దేశంలో మొదటి అడుగు వేశాను.

Click here to share your comments on this story